విశాలాంధ్ర కృష్ణా జిల్లా

కంకిపాడులో.. సీఎం జగన్

విశాలాంధ్ర-ఉయ్యూరు: కంకిపాడులోని కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం జరిగిన వివాహ వేడుకకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని మేనకోడలు డా. స్నేహ, డా.అనురాగ్ దీపక్ దంపతుల వివాహవేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

నారా భువనేశ్వరిని కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-మచిలీపట్నం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని అక్రమ అరెస్టు అనంతరం రాజమండ్రిలో ఉంటున్న నారా భువనేశ్వరిని గురువారం మర్యాదగాపూర్వకంగా కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు, అవనిగడ్డ నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథ రావు(బుల్లయ్య), ఆదిరెడ్డి వాసు,యార్లగడ్డ సీతారామయ్య, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులందరూ కలిసిన వారిలో ఉన్నారు.

'నిజం గెలవాలి' అనే నినాదంతో ప్రజల ముందుకు

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఈ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను చూపించి భయ పెడితే తెలుగుదేశం నాయకులు భయపడరని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో రాక్షస పరిపాలన కొనసాగుతుందని, నీతి నిజాయితీ గల చంద్రబాబు నాయుడు ని కావాలనే లేనిపోని కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టించారని, ఆయన నీతి నిజాయితీతో త్వరలోనే బయటకు వస్తారని ఆయన అన్నారు. నన్ను కావాలనే పోలీసులు వేధిస్తున్నారని, దీని వెనక వైసిపి నాయకులు ఉన్నారని ఆయన తెలిపారు. నా తల్లి అబ్దికం కూడా చేసుకోకుండా పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన తప్పు పట్టారు. ఇంటి చుట్టూ పోలీసులను పెట్టి పాల వాళ్ళని, పేపర్ వాళ్ళని, చుట్టాలని కూడా రానీకుండా మా ఇంటి ముందు బారి గేట్లు పెట్టడం దారుణమని ఈ రాష్ట్ర సీఎంకు ఇంత భయం ఎందుకు వచ్చిందో కూడా నాకు అర్థం కావడం లేదు అన్నారు. బీసీల గురించి ప్రశ్నిస్తే, బీసీ తరఫున పోరాడుతుంటే నన్ను ఇంతలా హింసిస్తున్నారని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడు సతీమణి అయిన భువనేశ్వ రి నిజం గెలవాలి అనే కార్యక్రమంతో ప్రజల ముందుకు వెళ్లడం రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈరోజు బందర్ లో తండ్రి కొడుకులు విచ్చలవిడిగా దోచుకుని దాచుకుంటున్నారే తప్ప ప్రజలను పట్టించుకోవడంలేదని ఆయన తెలిపారు. బీసీ మంత్రి అయిన జోగి ఎంతమంది బీసీ సోదరులకు ఎన్ని ఇల్లు ఇచ్చారో చెప్పాలని ఆయన నిలదీశారు. అలాగే ఈ రాష్ట్రంలో జె బ్రాండ్ మందు వల్ల 40 వేల మంది చనిపోయారని, ఎంతోమంది లేనిపోని రోగాలతో ఆసుపత్రులలో చికిత్స చేయించుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, కాగిత గోపాలకృష్ణ, కాగిత వెంకటేశ్వరరావు, తలారి రఘు రామారావు(రాంబాబు), కార్పొరేటర్ అనిత, కరెడ్ల సుశీల, పిప్పళ్ళ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ఆరోగ్య సురక్ష ధ్యేయం

విశాలాంధ్ర-బంటుమిల్లి : ప్రజారోగ్య పరిరక్షణకోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దేశమని డిప్యూటీ కలెక్టర్, ప్రత్యేకాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం మండల పరిధిలోని పెందురు ప్రభుత్వ పాఠశల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్య ఆంధ్రపదేశ్ లక్ష్యంగా ఇంటి దగ్గరే బీపీ, హెచ్ బి, డయాబెటిస్, మలేరియా, వంటి ఆరోగ్య పరీక్షలు చేసి తగిన వైద్య సాయం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలివెల చినబాబు, స్పెషలిస్ట్ డాక్టర్స్ అనురుద్ ఆర్థోపెడిక్, అచ్యుత్ పిల్లల డాక్టరు, కంటి వైద్య నిపుణులు ప్రవీణ్ ,పెందురు గ్రామ సర్పంచ్ చిటికినేని విశాలి ,చిటికినేని మాణిక్యలరావు ఎంపిటిసి ఎం లక్ష్మి శకుంతల, నాంచారమ్మ, వైఎస్సార్ మండల పార్టీ అధ్యక్షులు స్టునం మహేష్, మలిశెట్టి రాజబాబు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, ఎంపిడిఓ జె స్వర్ణ భారతి, తహశీల్దార్ ఎం సత్యన్నారాయణ, బంటుమిల్లి మెడికల్ ఆఫసర్ వి కె పవన్‌కుమార్, డాక్టరు సిహెచ్ సౌందర్య, పెడతుమ్మిడి మెడికల్ ఆఫసర్ కె సువర్చల, డాక్టరు వి జయ శ్రీ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు నీరు : డీఈ

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్రతి రైతు పొలానికి చివరి ఆయికట్టు వరకు సాగు నీరు అందించడం ప్రభుత్వ లక్ష్యమని ఇరిగేషన్ డి పి సూర్య భరత్ గురువారం అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ, పాములపాడు, జొన్నపాడు పంట కాలువలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతూ పట్టిసీమ నుండి వచ్చే సాగునీరు చేపల చెరువులకు వెళ్లకుండా వరి సాగుచేసిన రైతుల చివరి ఆయకట్టు పొలాలకు నీరు అందించటానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని అందులో భాగంగానే వంతులుగా వస్తున్న సాగునీరు వృధా కాకుండా ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తమ వంతుగా ఐదు రోజులు పాటు నీరు అందించటం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ ఎస్ పవన్ కుమార్, సిబ్బంది అయ్యప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి : గోళ్ల

విశాలాంధ్ర-పెదపారుపూడి : నవంబర్ 9వ తేదీన పామర్రులో జరగనున్న బస్సు యాత్రను విజయవంతం చేయటానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక మార్కెట్ యార్డు నందు నేడు సమావేశం వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి అధ్యక్షతన జరుగుతున్నందున మండలంలోని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, కన్వీనర్లు, హాజరవ్వాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులను కోరారు.

సర్పంచి భర్తకు ఎమ్మెల్యే అనిల్ పరామర్శ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం భట్ల పెనుమర్రు సర్పంచ్ మట్టా ఇందిర భర్త, వైసీపీ నాయకుడు మట్టాసతీష్‌ను గురువారం ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన సతీష్‌ను పరామర్శించారు. వైద్య సేవ లు అడిగి తెలుసుకున్నారు. జడ్పిటిసి రాజులపాటి పార్వతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

1వ వార్డులో స్వచ్ఛ భారత్

విశాలాంధ్ర-అవనిగడ్డ : 1 వ వార్డులో ఆ ప్రాంత వాసులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంత వాసులు యలవర్తి ఆదిశేషు, ఆదీల ఆధ్వర్యంలో గురువారం 1 వ వార్డులోని కోడూరు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెత్త కుప్పలను తొలగించి శుభ్రం చేశారు. గతంలో రోడ్డుకు ఇరువైపులా మందుబాబులు వీరంగం చేస్తూ తాగేసిన మందు సీసాలను పగులకొట్టి పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగచేశారు. గత వారం సీసా పెంకుల మొత్తాన్ని స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా తొలగించగా, ఈ వారం రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేసి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో రాజా, డి.యస్.సి విద్యార్థులు, ఆ ప్రాంత వాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచారు...!

విశాలాంధ్ర-మచిలీపట్నం : రైతులను పట్టించుకోని ఈ ప్రభుత్వానికి త్వరలోనే కాలం చెల్లుతుందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మండల పరిధిలోని పెదపట్నంలో నీళ్లు లేక ఎండిపోయిన పంట పొలాలను మాజీమంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకి 30 నుంచి 35 వేల రూపాయలు ఖర్చుపెట్టిన నీళ్లందక పొలాలు బీటలు వారే పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సభల్లో ప్రసంగాలు ఇవ్వడానికి తప్ప పరిపాలనికి పనికిరాని వ్యక్తిని ఆయన విమర్శించారు. పట్టిసీమ ద్వారా నీళ్లు అందించాలని గొప్ప ఆలోచనతో చంద్రబాబు అడుగులు వేస్తే దురుద్దేశంతో జగన్మోహన్‌రెడ్డి ప్రాజెక్టును నిర్మించలేదని, ఈ ముఖ్యమంత్రి స్వార్థ రాజకీయాలు వలన కృష్ణా జలాలపై హక్కును పోగొట్టుకోవలసిన పరిస్థితి దాపరించిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మైనింగ్ మాఫియా మీద తప్ప రైతులకు సరైన సమయంలో నీళ్లు అందించే పాపాన పోలేదని, ఈ ప్రభుత్వం తక్షణమే రైతులకు నీళ్లు అందించి ఆదుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, రైతులు పైన సరైన అవగాహన లేని ముఖ్యమంత్రి రైతు ప్రభుత్వం అని గొప్పగా దంకా బజా ఇస్తాడు తప్ప రైతు గోడు పట్టించుకోడని తీవ్రంగా విమర్శించారు. గతంలో అయితే తెదేపా ప్రభుత్వంలో ప్రతి నెల ప్రత్యేకంగా ఇరిగేషన్ శాఖ పైన చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టేవారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గోపు సత్యనారాయణ, కుంచె నాని, మీన వెల్లి నాగేశ్వరరావు, క్లస్టర్ లంకె నారాయణ ప్రసాద్, చేయబోయిన సత్యనారాయణ, లంకె హరి కృష్ణ, పెద్ద ఎత్తున రైతులు, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్న చేదోడు'తో ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-మచిలీపట్నం : కులవృత్తులు ద్వారా జీవనం సాగించే పేదరికం అనే చట్రంలో ఎన్నటికీ వారు ఇరుక్కోకూడదని భావించి ప్రభుత్వం జగనన్న చేదోడు పథకం రూపొందించి పేద మధ్యతరగతి వర్గాలను ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. గురువారం జగనన్న చేదోడు సాయం,వరుసగా 4 వ ఏడాది పథకంను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు రూ.10 వేలు చొప్పున సాయం అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 3. 25 లక్షల మంది రజకులు, నాయీ బ్రాహ్మణులు టైలరింగ్‌లో ఉన్న అన్నదమ్ములు అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా రూ.325 కోట్లు పంపిణీ కార్యక్రమం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు బహిరంగ సభలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సాయంతో కలిపి నాలుగేళ్లలో జగనన్న చేదోడు పథకానికే రూ. 1,252.52 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా నుంచి కలెక్టర్ పి. రాజాబాబు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఇందులో భాగంగానే రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్ల ఆర్థికాభివృద్ధికి జగనన్న చేదోడు పథకంతో ఏటా ఒక్కొక్కరికి రూ.10 వేలు అందిస్తూ చేదోడుగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగర పాలక సంస్థ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, జిల్లా రెవెన్యూ అధికారిణి పెద్ది రోజా, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ. శ్రీనివాసరావు ఇతర అధికారులు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యలు తీరుస్తాం

విశాలాంధ్ర-అవనిగడ్డ : సాగునీటి సమస్యలు తీరుస్తామని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావు అన్నారు. గురువారం వైయస్ఆర్‌సిపి కార్యాలయంలో నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుతం సాగునీటి సమస్య కొంత మేర ఉన్న మాట వాస్తవమేనని, అయితే వరి సాగు చేయాలంటే 60 శాతం కాలువల ద్వారా నీరు 40 శాతం వర్షపాతంపై ఆధారపడి సాగు చేయడం జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాలుగున్నర సంవత్సరాల్లో ఈ సంవత్సరం వర్షపాతం అతిస్వల్పంగా మాత్రమే నమోదు అయ్యిందని దీంతో సాగునీటి కష్టాలు వచ్చాయన్నారు. రైతుల కోసం రాత్రి పగలు పరితపించే శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో సాగు నీరు శుక్రవారం మధ్యాహ్నం నుండి పూర్తి స్థాయిలో అందనున్నట్లు ఆయన చెప్పారు. శ్రీశైలం డ్యామ్, నాగార్జున సాగర్ డ్యామ్ లలో నీటి జలాలు అడుగంటాయని పులిచింతల నుండి మోటర్‌ల ద్వారా ప్రస్తుతం సాగు నీటిని అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. గత ప్రభుత్వంలో కేవలం పులిచింతలలో 12 టి.ఎం.సి లనీరు మాత్రమే ఉండేదని జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అక్కడ నిర్వాశితులకు ఆర్థిక సాయం అందించి వారిని ఖాళీ చేయించడంతో 40 టి.ఎం.సి ల నీరు నిలుపుకునే అవకాశం వచ్చిందన్నారు. నాగాయలంక, కోడూరు మండలాల్లో గతంలో ఉన్న చెరువులను పూడ్చి సాగు చేయడంలో ఉప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాగు సరిపోవడం జరుగుతుందని ఆ విధంగా ఒకటి రెండు చోట్ల జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని రైతులు సాగునీటి విషయంలో అధైర్య పడవద్దని రైతుల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్ నాగిరెడ్డి లు రైతుల పట్ల చిత్త శుద్ధితో పనిచేస్తున్నారని ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ వంతుల వారి విధానంతో ఏ ఒక్క ఎకరం ఎండకుండా కృషి చేస్తున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ ధాన్యం కొనుగోలు విషయంలో వడుదుడుకులు సరిచేసుకుని గన్నీబ్యాగ్స్ కూడా సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, పాత ఎడ్లంక మాజీ సర్పంచ్ సైకం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు కంట కన్నీరు!

విశాలాంధ్ర-బంటుమిల్లి : ప్రతిపక్ష నాయకులపై ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమారెష్టులు చేయిస్తున్న వైసిపి ప్రభుత్వం ఒక్క సారి రైతులకు సాగునీటిని అందించే విషయంపై దృష్టిసారించి రైతులను ఆదుకుంటే బాగుంటుందని సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డికి పెడన నియోజవర్గం ఇన్చార్జి కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. మండల పరిదిలోని పెందుర్రు గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను గురువారం పరిశీలించిన కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వరి పంటకి నీరు లేక రైతు చాలా ఇబ్బంది పడుతున్నారని సత్వరమే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు కష్టపడి నాట్లు వేసి పంట పండించే సమయానికి నీరు లేక పోవుట వలన దిగుబడి తక్కువ వస్తుందని, నీరు పుష్కలంగా ఉంటే పంట దిగుబడి ఎక్కువ వస్తుందని, అందులో ఇప్పుడు పొట్ట దశలో ఉన్నటువంటి పొలాలకు నీరు చాలా అవసరం అని రైతులు కాగిత కృష్ణ ప్రసాద్‌కు తమగోడు చెప్పుకున్నారు. కాగిత స్పందిస్తూ రైతుల బాగోగులు చూడాల్సిన వైసిపి నాయకులు సమస్యలపై ప్రశ్నించే వారిని అక్రమ అరెస్టులు చేయించడంపై పెట్టే శ్రద్ధను రైతులకు సాగునీరు అందించే విషంపై పెట్టి రైతుల కన్నీటిని తుడవలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూనసాని చిన్న, సింగంశెట్టి శ్రీను, వన్నెంరెడ్డి కొండ, బొర్రా కాశీ, భూపతి రమేష్, శ్రీరామ మూర్తి కట్టా స్వామి, ఎండీ నజీర్, నాని, సుధాకర్, మరియు పెందుర్రు రైతులు పాల్గొన్నారు.

ఉయ్యూరు ఆర్డీఓగా రాజు

విశాలాంధ్ర-ఉయ్యూరు: ఉయ్యూరు ఆర్డీవో గా పనిచేస్తున్న ఎన్ విజయ్‌కుమార్‌ను జిఏడి (జనరల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్మెంట్) రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. భీమవరం ఆర్డీవోగా పనిచేస్తున్న డి రాజు ఉయ్యూరుకు ఆర్డీవోగా బదిలీ చేశారు.

ఈవీఎంలు తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-మచిలీపట్నం : కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్లలో ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి. రాజాబాబు పరిశీలించారు. ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ ఎలా కొనసాగుతున్నది, ఏవైనా సమస్యలు ఉన్నాయా ఇత్యాది విషయాలు అధికారులను తనిఖీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలు తూ చ తప్పక పాటించాలని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల యాక్టివ్ పార్టిసిపేషన్ ఉండేలా చూడాలన్నారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్ పర్యవేక్షకులు ,డిపిఓ నాగేశ్వర నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

27న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 27 వ తేది శుక్రవారం మధ్యాహ్నం పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం ప్రత్యేక సర్వీసు బయలుదేరుతున్నట్లు డిపో మేనేజర్ కె హనుమంతురావు గురువారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అరుణాచలం సర్వీసు అవనిగడ్డ నుండి రేపల్లె, భట్టిప్రోలు, చందోలు, భాపట్ల మీదుగా అరుణాచలం బయలుదేరి వెళ్తుందని, రేపల్లె అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలు, ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రతి నెల పౌర్ణమికి భక్తుల సౌకర్యార్థం అరుణాచల గిరి ప్రదక్షణకు వెళ్ళే ఈ సర్వీసు భాపట్ల, చీరాల, కానీపాకం, అర్ధవీడు, సిరిపురం, అరుణాచలం వెళ్ళి 28 వ తేది పౌర్ణమి రోజున దైవదర్శనం అనంతరం అరుణాచల గిరి ప్రదక్షణ చేసుకుని కంచి, విష్ణు కంచి, కామక్షమ్మ గుడి, బంగారు బల్లి, తిరుతుని, శ్రీకాళహస్తి దర్శించుకుని అక్టోబర్ 30వ తేది ఆదివారం అవనిగడ్డ బస్సు తిరిగి చేరుకుంటుందన్నారు. ఈ ప్రత్యేక బస్సుకు రిజర్వేషన్ సౌకర్యం కలదని, టికెట్లు ఆన్‌లైన్‌లో ఎటిబి ఎజేంట్ ల వద్ద కానీ రిజర్వేషన్ కౌంటర్ వద్ద కానీ పొందవచ్చని, రానూ పోనూ ఒకోక్కరికి బస్సు చార్జీ 3 వేల రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. కావున భక్తులు, ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని మరిన్ని వివరాలకు 9559225466 గానీ, 7036335079 గానీ సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు నిర్వహిం చిన దసరా ఉత్స వాలు అంబరాన్ని అంటేలా జరిగాయి. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి ఆధ్వర్యంలో విద్యార్థులు నవ దుర్గ వేషధారణలు ప్రత్యేకంగా ఆకట్టుకోగా, దుర్గమ్మ తల్లిని కీర్తిస్తూ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యపక బృందం, అధ్యపకేతర బృందం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట దర్నా

విశాలాంధ్ర-అవనిగడ్డ : నేటికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి 93.5 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేసేందుకు హామీ ఇచ్చి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా అమలు కాకపోవడంతో జనసేన, తెలుగుదేశం పార్టీలు సంయుక్తంగా ఎమ్మెల్యే కార్యాలయం ముందు మహా దర్నాకు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిర్వహించే మహా దర్నాకు ఆరు మండలాల నుండి ఆయా పార్టీల నేతలు, అభిమానులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలువు నిచ్చారు.

ముఖ్యమంత్రి హామీలు ఏమయ్యాయి.?

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాత ఎడ్లంక గ్రామానికి ఇచ్చిన వంతెన నిర్మాణం హామీ ఏమైందంటూ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్ ఆధ్వర్యంలో గురువారం ఎడ్లంక కృష్ణానది ఒడ్డున నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్ 20 వ తేదిన ప్రభుత్వ డిగ్రి కళాశాల క్రీడా మైదానంలో జరిగిన రైతు సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 8.5 కోట్ల నిధులతో ఎడ్లంక గ్రామానికి బ్రిడ్జి కడతామని సభాముఖంగా హామీ ఇచ్చినప్పటికి నేటికి సంవత్సర కాలం పూర్తి అయిన హామీ అమలు కానీ నీటి మూటలాగానే మిగిలిపోయిందన్నారు. శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్న అడిగారు నేను ఇస్తున్నాను అని ముఖ్య మంత్రి ఇచ్చిన హామీ కూడా అమలు కాకపోవడం ప్రభుత్వ పనితీరుని తెలియచేస్తుందన్నారు. కృష్ణా నదీపాయలో వంతెన కట్టిస్తానని హామీ ఇచ్చారు కానీ నేటి వరకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఏ విధమైన ముందడుగు వేయకపోవడంతో గ్రామస్థులు ఆందోళన బాట పట్టారు. గ్రామంలో వెయ్యి మంది ప్రజలు ప్రతి రోజు నదిలో అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నా వారి కష్టాన్ని పట్టించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక నేతలు విఫలం అయ్యారని విమర్శించారు. ఉదయం నుండి నిరసన దీక్ష చేస్తున్న గ్రామస్థులకు, యువతకు జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు సంఘీభావం తెలిపి నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, కనగాల సత్యంబాబు, దోవా యేసు, పాలేపు వెంకటేశ్వరరావు, దోవ బసవ కోటయ్య, దోవారి సంజయ్, మతంగి కనకరాజు లతో పాటుత గ్రామస్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వృద్ధుల అనుభవాన్ని యువత పాటించాలి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- వయోవృద్ధుల అనుభవాన్ని యువత తీసుకుని రాణించాలని విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి వి కామరాజు అన్నారు.స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నందు ప్రపంచ వయోవృద్ధుల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కామరాజు మాట్లాడుతూ వయోవృద్ధులకు ప్రభుత్వం కల్పిస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలు చట్టాలను గురించి వివరించారు. అలాగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తాసిల్దార్ ఎం సత్యనారాయణ, ఎంపీడీవో జే స్వర్ణ భారతి, ప్రముఖ విద్యావేత్త మట్టా రాధాకృష్ణమూర్తి, సీనియర్ న్యాయవాదులు యాళ్ళా సోమశేఖర్ , పళ్ళు వీర వెంకటేశ్వరరావు, సంఘ నాయకులు మోదుగుమూడి వెంకటేశ్వరరావు, ఎండి సిలార్, కోసూరి సత్యనారాయణ రాజు, సుజ్ఞానం జనార్ధన రావు తదితరులు మాట్లాడుతూ సోషల్ మీడియా వచ్చిన తర్వాత వ్యవస్థలు మారిపోతున్నాయి అన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా వృద్ధులపై వేధింపులు జరుగుతున్నట్లయితే వారికి ఆసరా కల్పించడానికి ముందుంటామని పేర్కొన్నారు. అనంతరం ఈ ప్రాంతంలో సీనియర్ సభ్యులైన మట్ట రాధాకృష్ణమూర్తి, క్రోసూరు సత్యనారాయణ రాజు, వల్లభు శ్రీరామ్ మూర్తి, కొట్టే నాగభూషణం దంపతులను ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని ఘనంగా దుశాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం అతిథులకు కూడా సభా మర్యాదగా సత్కరణ జరిగింది. సంఘ వ్యవస్థాపకులు చండిక గంగజాలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌరిశెట్టి నాగేశ్వరరావు, జ్యోస్తుల భాస్కరరావు, లంకదాసుల అజయ్ ఘోష్, మలిశెట్టి శివరాం ప్రసాద్, పెద్దసింగు నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆరోగ్య భరోసా...

విశాలాంధ్ర-ఉంగుటూరు : పొట్టిపాడు లోని జెడ్పీ పాఠశాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం పొట్టిపాడు గ్రామ సర్పంచ్ కె.జ్యోతి ,ఎన్ ఎ పేట గ్రామ సర్పంచ్ శ్రీ ఎన్ నాగరాజు ఆధ్వర్యంలో , జగన్న సురక్ష క్యాంపు గురువారం నిర్వహించారు. ఎం.పి.డి.ఓ జి.ఎస్.వి శేషగిరిరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలకు స్థానికంగానే స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా చికిత్స అందించడంతో ఆరోగ్య భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని తీసుకువచ్చారు అని , ఆరోగ్యం విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాత మంచాన పడి పెన్షన్ పొందే పరిస్థితి తెచ్చుకోవద్దని , ఇక్కడకు వస్తున్న వారికి కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందిస్తున్నారని, ఇద్దరు స్పెషాలిటీ వైద్యులు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్స్, ఒక కంటి వైద్యుడు అందుబాటులో ఉంటున్నారని , ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్ఎస్.కె కరిముల్లా , డాక్టర్ బి. మోహనరావు, డాక్టర్ అఖిల్ తేజ డాక్టర్ ఎన్ మల్లికార్జునరావు తహశీల్దారు డి.వనజాక్షి, ఎం.అమీర్ బాష , ఇ.ఓ (పి.ఆర్&ఆర్.డి), కార్యదర్శి జి.అప్పారావు, ఆరోగ్య సిబ్బంది , సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు , ప్రజా ప్రతినిధులు సునీల్, ప్రజలు పాల్గొనారు.

510 మందికి వైద్య సేవలు

విశాలాంధ్ర-కూచిపూడి : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు అర్హులైన పేద వర్గాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం భట్లపెనుమర్రు జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయన పరిశీలించి, కంటి వైద్య శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. శిబిరంలో 500 నుంచి వేయి మందిలోపుగా ఉచిత వైద్య సేవలు పొందుతున్నారని వివరించారు. సర్పంచ్ మట్టా ఇందిర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, తహశీల్దార్ సిహెచ్, వీరాంజనేయ ప్రసాద్, ఎం డి ఓ జి సుధాప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి డి. ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

కోర్కెలు తీర్చే మహా చండీదేవి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కోర్కెలు తీర్చే మహా చండీ దేవి రూపంలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. 70 ఏళ్ల చరిత్రలో ఇంద్రకీలాద్రిపై మొదటిసారిగా సరికొత్త రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. కనకదుర్గమ్మ పుణ్యక్షేత్రంలో దసరా ఉత్సవాలు ఐదవ రోజు మహా చండీ దేవిగా భక్తులు దర్శించుకున్నారు. శ్రీమహా చండీ అమ్మవారిని ప్రార్థిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్లే వేదపండితులు అంటున్నారు. అమ్మవారి అనుగ్రహం వలన విద్య,కీర్తి, సందపదలు లభించి శత్రువులు మిత్రువులుగా మారడం ఏ కోర్కెలు కోసం అయితే ప్రార్థిస్తేమో అవి సత్వరమే నెరవేరతాయనేది విశ్వాసం. ప్రతి ఏటా ఐదవ రోజు స్వర్ణకవచాలంకృత దుర్గ దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారు. అయితే ఈ ఏడాది చండీ అలంకారానికి మార్చింది వైదిక కమిటీ. దీనికి ప్రత్యేక కారణం కూడా ఉంది. ఈ ఏడాది అధిక శ్రవణం తిథిలో హెచ్చుతగ్గుల తేడా రావటంతో ఈ ఏడాది అమ్మవారి అలంకారాల్లో కూడా మార్పులు చేయాల్సి వచ్చిందంటున్నారు. పండితులు.నవరాత్రులు మొదలైన దగ్గర నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తున్నారు. మొదటి మూడు రోజుల్లో మూడు లక్షల మందిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సామాన్య భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

- మూలా నక్షత్రం రోజు వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలు రద్దు

- నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా

ఈనెల 20వ తేదీన శుక్రవారం మూలా నక్షత్రం రోజున సరస్వతీ దేవి అలంకృత అమ్మవారి దర్శనానికి దాదాపు రెండు నుంచి మూడు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేయనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా తెలిపారు. పోలీస్ కమిషనర్ గురువారం మధ్యాహ్నం ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనానికి చేసిన ఏర్పాట్లు సజావుగా అమలవుతున్నాయని.. ఇకపైనా ఇలాంటి చర్యలు కొనసాగుతాయని తెలిపారు. శుక్రవారం కొండ దిగువన రహదారులన్నీ, క్యూ లైన్లు భక్తులతో కిటకిటలాడనున్న నేపథ్యంలో ఫ్లైఓవర్ కింద వాహనాలకు అనుమతిని రద్దు చేసినట్లు తెలిపారు. సీతమ్మ వారి పాదాలు, మోడల్ గెస్ట్ హౌస్, కుమ్మరిపాలెం, వినాయకుని గుడి తదితర ప్రాంతాలన్నీ రద్దీగా ఉండే అవకాశం ఉందని. అందువల్ల సర్వీస్ వాహనాలు మినహా పాసులు ఉన్న వాహనాలకు కూడా శుక్రవారం కొండపైకి అనుమతి ఉండదని వివరించారు. వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలను రద్దు చేసినట్లు తెలిపారు. అదనంగా 700 నుంచి 800 మంది సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు. సామాన్య భక్తుల భద్రత లక్ష్యంగా పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలని కమిషనర్ కాంతి రాణా టాటా విజ్ఞప్తి చేశారు.

భక్తులు ఎన్ని కోరితే అన్ని... లడ్డూ ప్రసాదం సిద్ధం...

రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఇంద్రకీలాద్రి పై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి ఉన్న ప్రత్యేకతలలో లడ్డు ప్రసాదం కూడా అత్యంత ప్రాముఖ్యత కలిగింది. అమ్మవారిని దర్శించుకున్న ప్రతి ఒక్కరు ఎక్కువ మొత్తంలో లడ్డూలు కొనుగోలు చేస్తారు. సాధారణంగా మామూలు రోజుల్లోనే ఈ లడ్డు ప్రసాదానికి ఎక్కువ డిమాండ్ ఉంటుంది. నవరాత్రి ఉత్సవాల రోజులలో ఈ డిమాండ్ మరింత పెరుగుతుంది. శరన్నవరాత్రి ఉత్సవాలకు వస్తున్న భక్తులకు కోరిన లడ్డూలు అందించేందుకు దేవస్థానం సిద్ధమైంది. గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు లడ్డూ ప్రసాద తయారీ కేంద్రం (లడ్డూ పోటు), లడ్డు ప్రసాదం విక్రయ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాలలో ఇప్పటివరకు ప్రతిరోజు 60 నుంచి 70 వేల వరకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. మొత్తంగా నవరాత్రి ఉత్సవాలలో 25 లక్షల లడ్డూలు విక్రయించే అవకాశం ఉందన్నారు. శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా భక్తుల సంఖ్య అసాధారణ స్థాయిలో ఉంటుందన్నారు. అదే సమయంలో లడ్డు ప్రసాదానికి కూడా డిమాండ్ పెరుగుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రెండున్నర నుంచి మూడు లక్షల లడ్డూలను ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో దేవస్థానం సహాయ కార్య నిర్వహణ అధికారి ఎస్. రమేష్, సిబ్బంది లక్ష్మణ స్వామి, ఎం ఎస్ ఆర్ కె ప్రసాద్, గుత్తేదారు ఎం. చందు కలెక్టర్ వెంట ఉన్నారు.

నేడు శ్రీసరస్వతి దేవి (మూలానక్షత్రం)

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీకనదుర్గమ్మవారు శ్రీసరస్వతీదేవిగా అలంకారంలో దర్శనమిస్తారు. మూలా నక్షత్రం శ్రీఅమ్మవారి జన్మనక్షత్రం. మహాకాళి, మహాలక్ష్మీ, మహా సరస్వతిగా శక్తి స్వరూపాలతో దుష్ట సంహారం చేసిన శ్రీదుర్గాదేవికి శరన్నవరాత్రి ఉత్సవాలలో మూలానక్షత్రం రోజున వాగ్దేవతామూర్తి అయిన సరస్వతీ అవతారంలో భక్తులను అనుగ్రహిస్తారు. సరస్వతీదేవిని సేవించడం వలన విద్యార్థినీ విద్యార్థులు సర్వ విద్యల యందు విజయం పొందుతారు. భక్తులు భావించి శ్రీదుర్గమ్మను ఆరాధిస్తారు. భక్తజనుల అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించే జ్ఞానప్రదాయిని శ్రీసరస్వతీదేవి. శ్రీసరస్వతీదేవి దర్శనం అఖిల విద్యాభ్యుదయప్రదాయకం.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం జగన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈనెల 20వ తేదీ, శుక్రవారం , మూలా నక్షత్రం (అమ్మవారి జన్మ నక్షత్రం) రోజున సరస్వతీ దేవి అలంకృత కనక దుర్గమ్మ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించేందుకు గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇంద్రకీలాద్రిని సందర్శించనున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లపై జిల్లా అధికార యంత్రాంగం.. పోలీస్, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించింది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో చేస్తున్న కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా పరిశీలించి అనంతరం చేయాల్సిన ఏర్పాట్లను అధికారులకు వివరించారు. ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా.. భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది సమక్షంలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏ.ఎస్.ఎల్) నిర్వహించారు. కాన్వాయ్ దిగువ నుంచి ఇంద్రకీలాద్రి పైకి సాఫీగా చేరుకునేలా ట్రయల్ రన్ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్ గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్, ఆలయ ఈవో కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రత ఏర్పాట్లు పరిశీలించిన సీపీ

నేడు మూలా నక్షత్రం రోజున అమ్మవారు సరస్వతి దేవి అలంకారంలో దర్శనమిస్తారని, ఆ రోజున లక్షన్నర నుండి రెండు లక్షల వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉంటుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పించడానికి వస్తున్న సందర్భంగా ఎటువంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేయడంతో పాటు బందోబస్త్ నిర్వహించు అధికారులకు మరియు సిబ్బందికి గురువారం సిటీ ఏ.ఆర్ గ్రౌండ్స్‌లో నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా ఇతర అధికారులతో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కాంతి రాణా మాట్లాడుతూ భక్తుల రద్దీని గమనిస్తూ ఎక్కడికక్కడ హెూల్డింగ్ ప్రదేశాలలో భక్తులను నిలుపుదల చేస్తూ, క్యూ లైన్లలో ఎక్కడా రద్దీ ఏర్పడకుండా వీలైంత త్వరగా భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునే విధంగా చూడాలన్నారు. కనకదుర్గా నగర్, అన్న ప్రసాద వితరణ ప్రదేశం, ప్రసాదం కౌంటర్ల వద్ద రద్దీని గమనిస్తూ ప్రతి సెక్టార్ లో విధులు నిర్వహించు అధికారులకు సిబ్బందికి ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అన్ని శాఖల అధికారులతో సమన్వయము చేసుకుంటూ పటిష్ట బందోబస్త్ నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ విశాల్ గున్ని, ఏఐజీ ఎం.రవీంద్రబాబు, ఎస్పీ కే.శ్రీనివాసరావు, సీఎస్‌టీ ఏడీసీపీ సిహెచ్.లక్ష్మీపతి, ఏసీపీలు, సీఐలు ఉన్నారు.

ఇంటర్ రైల్వే ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఇంటర్ రైల్వే ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత- టీమ్ ఈవెంట్‌లలో బంగారు పతకం సాధించిన రైల్వే ఉద్యోగిని డిఆర్ఎం నరేంద్ర ఎ. పాటిల్ అభినందించారు. ఈనెల 8 నుండి 10 వరకు గౌహతిలోని కామాఖ్యలోని ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిన 13వ ఆల్ ఇండియా రైల్వే ఆర్చరీ ఛాంపియన్‌షిప్ ఓటీలు నిర్వహించారు. ఇందులో విజయవాడ డివిజన్‌కు చెందిన వై.చరణ్‌రెడ్డి, మరో ముగ్గురు పాల్గొన్నారు. అందులో వై.చరణ్ రెడ్డి ఈస్ట్ కోస్ట్ రైల్వేను 150 పాయింట్లకు 146-143 తేడాతో ఓడించి వ్యక్తిగత బంగారు పతకాన్ని సాధించారు. అలాగే చరణ్ రెడ్డి ఎస్సీ రైల్వేకు చెందిన నలుగురు సభ్యుల టీమ్ ఈవెంట్‌లో ఆతిథ్య జట్టు నార్త్‌ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వేను (240కి 222-222) ఓడించి గోల్డ్ మెడల్ సాధించారు. కీలకమైన టై-బ్రేక్‌లో 30కి 30-28 పాయింట్లు సాధించారు.ఈ సందర్భంగా గురువారం డిఆర్ఎంతన కార్యాయంలో చరణ్‌రెడ్డిని పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు.అలాగే ఇతర ముగ్గురు క్రీడాకారులు వారి చతురత,క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారని విజయవాడ డివిజన్‌కు గర్వకారణమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సీనియర్ డిపిఓ ఎమ్.బాల మురళీధర్ పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి పంటపై రైతులకు శిక్షణ

విశాలాంధ్ర-ఎ. కొండూరు : మండలంలోని కంభంపాడు గ్రామంలో గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకము ఖరీఫ్ 2023 సంబంధించి వరి ఎం.టి.యు 1061 రకంలో రైతులకు శిక్షణ కార్యక్రమం ను కంభంపాడు గ్రామ సచివాలయంలో జిల్లా వనరుల కేంద్రం విజయవాడ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారంనిర్వహించారు. ఇందులో భాగంగా వరిలో మూల విత్తనం, బ్రీడర్ విత్తనం ఫౌండేషన్ విత్తనం మరియు సర్టిఫైడ్ విత్తనం ఇలా ట్రూత్ ఫుల్ లేబుల్ విత్తనం మొదలగు వాటి గురించి జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మోనిషావివరించారు. అంతేకాక జన్యు స్వచ్ఛత భౌతిక స్వచ్ఛత తేమశాతం మరియు మొలక శాతం మొదలగు అంశాల గురించి మండల వ్యవసాయ అధికారి షేక్ టిప్పు సుల్తాన్ రైతులకు తెలిపారు. ప్రస్తుతం వరి పంటలో ఎక్కువగా ఇబ్బంది పెడుతున్న ఆకు మడత నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లేదా క్లోరంట్రానిలిప్రోలు 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ. ఓ. ఏ. రామచంద్ర రావు, ఎం.పి.ఈ. ఓ. సాంబశివచారి, రైతులు పాల్గొన్నారు.

శ్రీలలితా త్రిపుర సుందరిదేవిగా...

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు దసరా ఉత్సవాల ఐదవ రోజైన గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని జనసేన పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం పాలకవర్గం స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు, ముఖ్యంగా మహిళలు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకునీ పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరు పిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. దసరా ఉత్సవాల కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు ,కార్యవర్గ సభ్యులు పోతిన బేసికంటేశ్వరుడు, మజ్జి ఈశ్వరరావు, మజ్జి శ్రీనివాసరావు, కామందుల నరసింహారావు , భోగవల్లి శ్రీధర్, పోతిన వెంకట ధర్మారావు, బంక హనుమంతరావు, బెవర సాయి సుధాకర్, పణుకు రమ, పిళ్ళా విజయ్ కుమార్, గూడేల రామకృష్ణ పాల్గొన్నారు.

యువత అకాంక్షల మేరకు రెడిమేడ్ చేనేత వస్త్రాలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : యువత అకాంక్షలకు అనుగుణంగా రెడిమేడ్ చేనేత వస్త్రాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రాష్ట్ర చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కే.సునీత తెలిపారు. నగరంలోని బాపు మ్యూజియంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆప్కో షోరూమ్‌ను పురావస్తు శాఖ కమీషనర్ డాక్టర్ వాణీమోహన్‌తో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కార్మికులకు గణనీయమైన ఉపాధి చూపాలన్న ధ్యేయంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నూతన షోరూమ్‌లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 19వ తేదీన ఒకే రోజు విజయవాడ, ఏలూరు, విశాఖపట్నంలో షోరూమ్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. నూతన ఫ్యాషన్లకు అనుగుణంగా బాపు మ్యూజియం షోరూమ్‌ను తీర్చిదిద్దామని, ప్రారంభోత్సవం సందర్భంగా అన్ని రకాల వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక రాయితీని అందిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతకు మన్నికకు పేరెన్నికగన్న ఆప్కో వస్త్రాలను ధరించి నేత కార్మికులకు నిత్యం పని దొరికేలా వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన వాణీ మోహన్ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో బాపు మ్యూజియంలో ఆప్కో షోరూమ్ ఏర్పాటు కావటం మంచి విక్రయాలకు దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కో జీఎంలు తనూజా రాణి, బీ.నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరావు, డివిజినల్ మార్కెటింగ్ అధికారి రఘునంద పాల్గొన్నారు.

నాలుగవ ఏడాది కూడా జగనన్న చేదోడు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో జగనన్న చేదోడు పథకంలో 4వ విడత 15,176 మంది లబ్ధిదారులకు రూ.15.18 కోట్లు లబ్ది చేకూరనున్నదని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, ఎమ్మెల్యే ఎం.విష్ణువర్ధన్ జగనన్న చేదోడు పథకంలో లబ్ధిదారులకు చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి అనగా 4వ ఏడాదికి నూతన లబ్దిదారుల ఎంపిక, గత సంవత్సరం లబ్దిదారుల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసి జిల్లాలో ఈ పథకానికి 15,176మంది లబ్దిదారులను అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.15.18 కోట్లు ఆర్థిక సహాయం అందించనున్నామన్నారు. వీరిలో వృత్తి చేసుకుంటున్న 10926 మంది దర్జీలకు 10.93 కోట్లు, 2,979 మంది రజకులకు రూ.2.98 కోట్లు, 1,271 మంది నాయిబ్రాహ్మణులకు రూ.1.27 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు శ్రీకాంత్, శివరామకృష్ణ, గౌస్ మెహీద్, గీతాంజలీదేవి, పుణ్యశీల, జమలపూర్ణమ్మ, బీసీ కార్పొరేషన్ ఏఇఓ. రాజేంద్రబాబు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి : విద్యాసాగర్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జిల్లా జేఏసీ చైర్మన్ ఈ విద్యాసాగర్ డిమాండ్ చేశారు.రాష్ట్ర యుటిఎఫ్ కార్యాలయంలో జిపిఎస్ ను రద్దు చేయాలని కోరుతూ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులను, జిల్లా కార్యవర్గ సభ్యులతో కూడిన శిబిరాన్ని జిల్లా జేఏసీ చైర్మన్ ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు విద్యాసాగర్ సందర్శించి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ స్థానంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిపిఎస్ విధానాన్ని ఉద్యోగులు ఉపాధ్యాయులు ఏ ఒక్కరు కూడా ఆమోదించడం లేదని, దీనివల్ల ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం లేదని, పాత పెన్షన్ పునరుద్ధరణ మాత్రమే ఈ సమస్యకు పరిష్కారమని తెలిపారు. ఉద్యోగ వద్ద నుంచి కంట్రిబ్యూషన్ తీసుకుని సిపిఎస్ రద్దయిందని ఎలా చెబుతారని,ఉద్యోగులు కట్టిన మొత్తం సొమ్మును ప్రభుత్వం తీసుకునే 50% పెన్షన్ ఇస్తానని సమంజసం కాదని, మిగతా రాష్ట్రాలలో ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరిస్తున్నారని,కానీ ఇక్కడ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పి ఎవరికి ప్రయోజనం లేని జిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు.ఉపాధ్యాయులు చేస్తున్న ఈ ఉద్యమానికి పూర్తి మద్దతును ప్రకటించారు. నిరోధిక నిరాహార దీక్ష చేస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు నక్క వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్,సుందరయ్య,కార్యవర్గ సభ్యులను ఉపాధ్యాయులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డీవీ కృష్ణ పాల్గొని సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సతీష్, ఉపాధ్యక్షులు నాగేంద్ర, విజయవాడ నగర శాఖ నాయకులు నజీర్, సిహెచ్ ప్రసాద్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : భారతదేశంలో ఎక్కడ లేని విదంగా ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవులు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వీ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక 40వ డివిజన్ విజేత పబ్లిక్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిభిరాన్ని ఎమ్మెల్యే నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిభిరాల ద్వారా ఇంటి వద్దనే 7 పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం అందిస్తునట్లు తెలిపారు. మేయర్ మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తుంటారు కాబట్టి వాళ్లకి ఎక్కువ శాతం రక్తహీనత, లో బీపీ వంటి సమస్యలు ఉంటాయన్నారు. ఈ శిభిరంలో ద్వారా తగ్గని సమస్యలు ఉంటే ఆరోగ్యశ్రీ ద్వారా పెద్ద ఆసుపత్రులకు పంపించి పూర్తిగా ఆరోగ్యవంతులుగా చేసేదాకా జగనన్న సురక్ష వాళ్లకు తోడుగా ఉంటుందని తెలిపారు. కార్పొరేటర్ అంజనేయరెడ్డి, జిల్లా వైద్య శాఖ అధికారి సుహాసిని పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇంద్రకీలాద్రి పై శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదవ రోజు మహా చండీ దేవిగా రూపంలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పండితులు.నవరాత్రులు మొదలైన దగ్గర నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తున్నారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు హెల్పింగ్ టు గెదర్ 2009 చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఇంద్రకీలాద్రినగర్‌లో భక్తులకు 50 కేజీల కదంబ ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్.షఫీవుల్లా, మల్లిక, హేమంతరావు, అవినాష్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకున్న కళా బృందాల ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో కళా బృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళా బృందాలు అద్భుత ప్రదర్శన ఇచ్చింది. అందులో విజయవాడ రాజరాజేశ్వరిపేటకు చెందిన శ్రీలక్ష్మీ నరసింహా కోలాటం బృందం ఆధ్వర్యంలో 25 మంది కోలాటం భక్తులకు ఆకట్టుకుంది. శ్రీవారి మాడ వీధిలో కన్నుల పండుగా కోలాటం ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనలో తురాల చానూకా యాదవ్, వైజయంతిమాల, రాయుడు, తురాల బాలాంబిక జగదేశ్వరి యాదవ్, తురాల ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామి దర్శనం చేసుకున్నారు.

బాబు కోసం మేము సైతం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) ఆదేశాల మేరకు ఎం.ఎస్ బేగ్ సూచనలతో రాజమండ్రిలో నారా భువనేశ్వరమ్మ మద్దతుగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ మహిళా విభాగం ఆధ్వర్యంలో తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుఖాసి సరిత, ప్రధాన కార్యదర్శి షేక్ నసీమా, పశ్చిమ నియోజకవర్గం అంగన్వాడి కన్వీనర్ లక్కు శాంతి, కొట్టేటి సరిత, బండారు జ్యోతి, ముర్రి అపర్ణ, షేక్ షకీలా, కొనన లక్ష్మి, శానం వాణి, కశింకోట మల్లేశ్వరి, జి జానకి, వరలక్ష్మి, బి రామలక్ష్మి పాల్గొన్నారు.

విభజన హామీలను సాధించటంలో వైఫల్యం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దశాబ్దాలుగా ఆంధ్రులకు అన్నింటా అన్యాయం జరుగుతూనే ఉంది ప్రస్తుతం కుడా విభజన హామీలను సాధించటంలో అన్ని రాజకీయ పక్షాలు తమ స్వార్ధప్రయోజనాలు కోసం తప్పా రాష్ట్ర ప్రయోజనాలు కోసం కృషి చేయటంలేదని ఇచ్చి హామీలను సాధించుకొవాలి అంటే నూతన ప్రత్యామ్నాయ రాజకీయ నిర్మాణం జరగాలనే లక్ష్యంతో డిసెంబర్ 28న విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని దీనిలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకొవాలని నాయకులు పిలుపునిచ్చారు. గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జై ఆంధ్ర ఉద్యమ పొలికేక అధ్వర్యంలో ప్రత్యేక హోదా-విభజన చట్టం అమలు కోసం మేధావుల మేథోమధన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో జై అంధ్ర ఉద్యమ నేత దేవరపల్లి మహేష్ మాట్లాడుతూ ఆనాటి మద్రాస్ నుండి కర్నూలు, ఆ తర్వాత హైదరాబాదు మన రాష్ట్రం అని ఆంధ్రప్రదేశ్ ప్రకటించి మన శ్రమను,మేథస్సును పెట్టుబడిగా పెట్టి అభివృద్ధి చేశారన్నారు. జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం అధ్యక్షులు గరగపత్తి రామకృష్ణ (సినీ నటులు రామ్‌కి) మాట్లాడుతూ హైదరాబాదులో మన ప్రజల శ్రమని అక్కడ పెట్టి అభివృద్ధి చేశారని విభజన అనంతరం మనకు రాజధాని లేకుండా పోయిందన్నారు. జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్, ఎల్ జై బాబు మాట్లాడుతూ రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి ప్రతిఫలంగా ఆంధ్రప్రదేశ్ రాయితీలతో కూడిన ప్రత్యేక హోదా 10 ఏళ్ళు కల్పిస్తాం. ఆర్థిక లోటును భర్తీ చేయటంతో పాటు అన్నింటా అండగా నిలుస్తాం అని పచ్చిగా నమ్మించి నేడు ద్రోహం చేశారన్నారు. మోడీ సర్కార్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కక్ష గట్టి మన రాష్ట్రంలో గల అపార ఖనిజ సంపదను వారి స్వార్థం కోసం దోచుకుపోతున్నారన్నారన్నారు. ఈ సమావేశంలో బేతు రామ్మోహన్, వెంకటరెడ్డి, జె.టి.రామారావు, నాగలక్ష్మీ, జె.త్రిలోక్‌నాథ్‌రెడ్డి, ఓ.వీర భాస్కర్, ఎమ్.విజయలక్ష్మీ, డి.రెడ్డిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ విడుదల చేయాలి

విశాలాంధ్ర-వీరులపాడు: దసరా కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు డి ఏ ను వెంటనే ప్రకటించాలని పిఆర్టియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు షేక్ నవాబ్ జాని డిమాండ్ చేశారు. గురువారం జయంతిలో పిఆర్టియు కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు దసరా కానుకగా డిఏని ప్రకటిస్తామని మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటన విడుదల చేశారు,కానీ నేటికీ డి ఏ ఉత్తర్వులు విడుదల కాలేదు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దసరా కానుకగా నాలుగు శాతం డి ఏ ని ప్రకటించారని ఆ నిర్ణయానికి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండిగ్ డి.ఏ ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పిఆర్‌టియు వీరులపాడు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పిఆర్‌టియు వీరులపాడు మండల శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా దొడ్డా నారాయణ, జంగా రామిరెడ్డి లను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు నవాబ్ జానీ తెలిపారు. ఎన్నికల అధికారిగా పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆవుల రాంబాబు, పరిశీలకులుగా చందర్లపాడు ప్రధాన కార్యదర్శి గర్మిడి మొగిలేశ్వరరావు ఎన్నిక నిర్వహించారు.మండల అసోసియేట్ అధ్యక్షులుగా బి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.రామ శేఖర్, మహిళా ఉపాధ్యక్షులుగా బి.సీతా రత్నం,కార్యదర్శులుగా కే.సునీత, బి.రామకృష్ణారెడ్డి,మహిళా కార్యదర్శిగా కే.శివ కుమారి,జిల్లా కౌన్సిలర్లు గా వి.పుల్లారెడ్డి, బి.కృష్ణను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా రెడ్‌ఎఫ్‌ఎమ్ దాండియా లైట్స్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : ట్రెండ్ సెట్ మాల్ ఎనిమిదో వార్షికోత్సవం పురస్కరించుకుని దసరా సందర్భంగా రెడ్ ఆఫ్ 93.5 దాండియా లైట్స్ నిర్వహించినట్లు రెడ్ ఎఫ్ఎం స్టేషన్ హెడ్ క్రాంతి కుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మాల్ కి వచ్చిన వారు తమ మిత్రులతో, కుటుంబము తో హాయిగా దాండియా ఆడే విధముగా ఏర్పట్లు చేశామన్నారు. వీటితో పాటు సెల్ఫీ పాయింట్స్, పునీత్ విజన్ గెలాక్సీ వారి ఉచిత కంటి పరీక్షలు, కార్యక్రమంలో రెడ్ ఎఫ్ఎం ఆర్జెస్ ఆర్ జె ఆర్య, స్మార్ట్ స్వీటీ, అన్య, సుధాకర్ వీక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో ట్రెండ్ సెట్ మాల్ ట్రెజరర్ కృష్ణ ప్రసాద్, సెక్రెటరీ జగన్ తదితరులు పాల్గొన్నారు.

మిక్‌లో ఘనంగా దసరా వేడుకలు

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ లో గురువారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీ కిరణ్ తెలిపారు. వేడుకల్లో భాగంగా కళాశాల ప్రాంగణంలో బతుకమ్మలను ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడారు. విద్యార్థునుల ఆటపాటలతో, సాంప్రదాయ నృత్యాలతో కార్యక్రమం అధ్యంతం అత్యంత ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పోటీల్లో విజేతలకు బహుమతులను కళాశాల సీఈఓ డి. పాండు రంగారావు, మేనేజ్మెంట్ నెంబర్ ఎం. సుహాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ. వంశీ కిరణ్ అందజేశారు. వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రఘునందన్ కవితలు రికార్డింగ్

విశాలాంధ్ర-విజయవాడ: అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్ రచించిన కవితలను ఆకాశవాణి విజయవాడ కేంద్రం వారు ఈ నెల 20 వ తేదీ న రికార్డు చేయనున్నారు. నవంబర్ 14 న బాలల దినోత్సవం సందర్భంగా వాటిని ప్రసారం చేస్తారు. గతంలో కూడా వివిధ సందర్భాలలో ఆయన రచించిన కవితలు, కథలు, వ్యాసాలు ఆకాశవాణిలో ప్రసారం అయ్యాయి. ఈ సందర్భంగా అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి వల్లూరు శివ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు కొప్పర్తి రాంబాబు ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, కార్యదర్శి అరసం అరుణకుమార్ తిరువూరు సాహితీ మిత్రులు రఘునందన్ కు అభినందనలు తెలిపారు.

250 కస్టమర్ టచ్ పాయింట్స్ ల్యాండ్ మార్క్ ని అందుకున్న స్కోడా ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో ప్రీమియం కార్ల తయారీలో అగ్రగామి సంస్థ స్కోడా ఇండియా, తాజాగా తన ఉత్పత్తి వ్యూహాలను ప్రారంభించింది. ఇందుకోసం ఈ స్పెషల్ పండుగ సీజన్ ను ఉపయోగించుకుని ఆఫర్లను ప్రకటించింది. తద్వారా స్కోడా ఆటో ఇండియా తన నెట్వర్క్ ను భారతదేశం అంతటా 250 కస్టమర్ టచ్ పాయింట్లకు విస్తరించే మైలురాయిని సాధించింది. కంపెనీ యొక్క డ్రైవింగ్ కార్లు అయినటువంటి, కుషాక్ ఎస్యూవీ, స్లావియా సెడాన్ భారతదేశంలో స్కోడా బ్రాండ్ ను మరింతగా పెంచడంలో, విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దీంతో పాటుగా కస్టమర్ సెంట్రిసిటీపై లేజర్ షార్ప్ ఫోకస్ ఉంది. దీనిలో నెట్వర్క్ విస్తరణ కీలక పాత్ర పోషిస్తుందని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్రో సాల్క్ పేర్కొన్నారు.

అత్యుత్తమ నైట్‌లైఫ్ అనుభవాన్ని భారతదేశానికి తీసుకురానున్న అబ్జల్యూట్, సన్‌బర్న్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రపంచపు నెంబర్ 10 మ్యూజిక్ ఫెస్టివల్, ఆసియా ప్రీమియర్ ఈడీఎం ఫెస్టివల్‌గా ప్రసిద్ధి చెందిన సన్‌బర్న్‌తో తన మూడేళ్ల అనుబంధానికి కొనసాగింపుగా, దేశంలోని యువతకు సంతోషకరమైన అనుభవాలు అందించడం కోసం అబ్జల్యూట్ గ్లాస్‌వేర్ మరోసారి సంసిద్ధమైంది. ఆరు మంది గ్లోబల్ ఆర్టిస్టులు, ప్రపంచ ప్రసిద్ధ డిజెలతో పదికి పైగా నగరాల్లో నిర్వహించనున్న 24 ప్రదర్శనలతో పాటుగా గోవాలో ఈ ఏడాది డిసెంబర్ 28 నుండి 31 వరకు జరిగే ప్రపంచ ప్రసిద్ధ సంగీత ఉత్సవానికి సహ సమర్పక భాగస్వామిగా అబ్జల్యూట్ గ్లాస్‌వేర్ స్ఫూర్తి నింపనుంది. భారతదేశంలోని నైట్ లైఫ్ భవిష్యత్తును సొంతం చేసుకోవాలని ఈ బ్రాండ్ లక్ష్యంగా పెట్టుకుంది.

బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : గురువారం బిఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ విజయవాడ వారి సహకారంతో నగరంలోని చుట్టుగుంట బిఎస్ఎన్ఎల్ భవన్లో శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.జి.ఎం. టెలికాం ఎం.శేషాచలం, సీనియర్ జి.ఎం. కె.వి.సత్యప్రసాద్, జి.ఎం. వై. రవీంద్రనాథ్, డి.జి.ఎం.పి.కోటేశ్వరరావు , డి.జి.ఎం. జె.ఉమామహేశ్వరరావు పలువురు బిఎస్ఎన్ఎల్ సిబ్బంది పాల్గొని రక్తదానం చేసారు. డాక్టర్ రంజిత, వైద్య అధికారి, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, తమ సహాయక సిబ్బంది సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

చిన్నారులకు ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : అతి పిన్న వయసులో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు దర్శి వెంకటకృష్ణ,దర్శి త్రినాద్ లకు నందిగామ కాకతీయ విద్యాసంస్థల అధినేత కాపా రవీంద్రనాథ్ చేయూతనందించారు సేకరించిన వివరాల మేరకు చందర్లపాడు మండలం తొర్లపాడు గ్రామానికి చెందిన చిన్నారులు దర్శి వెంకట కృష్ణ,దర్శి త్రినాథ్ అన్నదమ్ములు నందిగామ కాకతీయ స్కూల్ లో విద్య నభ్యసిస్తున్నారు.వీరి తల్లి ఈశ్వరమ్మ గత మూడు నెలల క్రితం తీవ్ర అనారోగ్యంతో మరణించింది.తండ్రి వీర్రాజు కవులు రైతు. మనోవేదనతో భార్య చనిపోయిన రెండు నెలలకు ఇతను కూడా చనిపోయినాడు.విషయం తెలుసుకున్న రవీంద్రనాథ్ చలించి పోయారు ఇక ఆ పిల్లలకు వారి అమ్మమ్మ ఒకటే దిక్కుగా ఉంది ఆమె కూడా వృద్ధాప్యంలో ఉండటం గుంటూరు జిల్లా వాసి ఐ వండటం వలన ఆ పిల్లల విద్య బుద్ధులకు ఆహార ఖర్చులకు స్కూలు యాజమాన్యం మరియు అధ్యాపక బృందం తరఫున రెండు లక్షల రూపాయలను వారికి ఫిక్స్ డిపాజిట్ చేయడం ఎంతో గణనీయంగా పలువురు అభినందిస్తున్నారు అంతేకాకుండా పిల్లలకు విద్యను అభ్యసించడంలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా పూర్తి స్థాయిలో స్కూల్ నందు ఉచితంగా విద్యను అందిస్తున్నారు ట్రాన్స్పోర్ట్ ఖర్చులతో సహా ఉచితంగా అందించడంతో ఆ విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా పోయింది మానవత్వం పరిమళించిన కాకతీయ పాఠశాల మంచి మనసుకు పలువురు హృదయ పూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నారు ఇటువంటి మంచి మనసులు ఉంటే భూమే స్వర్గం కాదా అంటూ యాజమాన్యం మరియు వారి బోధన సిబ్బందికి పలువురు నుంచి అభినందనలు తెలిపారు..

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : భారతదేశంలో పుట్టిన ప్రప్ర థమ కార్మిక సంఘం ఏఐటీ యూసీ అని గుంటూరు జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మేడా హను మంతరావు అన్నారు. మంగళగిరి వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కామ్రేడ్ నందం బ్రహ్మేశ్వరరావు అధ్యక్షత వహించారు. మేడా హనుమంతరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న ఏకైక సంఘం ఏఐటీయూసీ అని కార్మికుల పక్షాన ఏ సమస్యలు ఉన్న పోరాటాలకు ముందుండే సంఘమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంఘాలను కుదేలు చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలని కార్మికులకు రక్షణ చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం అక్టోబర్ 31వ తేదిన అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని పిలుపుని చ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్య క్షులు ఆకిటి అరుణ్ కుమార్, జిల్లా కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ నియోజక వర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మంగళగిరి కార్యదర్శి గండికోట దుర్గారావు, సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

డాక్టర్ సాయి కిరణ్‌కు అవార్డు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి మానసిక వైద్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పసుపుల సాయి కిరణ్‌కు 'డాక్టర్ రఘురామ రెడ్డి ఉత్తమ రీసెర్చ్'అవార్డు లభించడంపై సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అభినందనలు తెలియజేశారు. 'చిన్న పిల్లల్లో మానసిక సమస్యలు' అనే అంశంపై పరిశోధనకు ఇటీవల గుంటూరులో జరిగిన దక్షిణ భారత మానసిక సదస్సులో ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో చిన్న పిల్లలో మానసిక సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని త్వరగా గుర్తించి వైద్యం చేయడం వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం వారు మానసిక ధైర్యం కోల్పోయి వత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనాధలు, హాస్టల్‌లో ఉండే వారు..కుటుంబలకు దూరంగా ఉంటున్న వారు ఎక్కువగా మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, అలాంటి వారికి సరైన వైద్యం అందించి విముక్తి కలిగించాలని ఆయన సూచించారు. మానసిక వైద్య విభాగం విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నిమిషా పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక గుంటూరు ఆర్. అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తుల కోలాహలం నడుమ వైభవంగా జరుగుతున్నాయి. ఈ మేరకు 5వ రోజు అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు టీఎల్వీ వీరాంజనేయులు, నేరెళ్ల వెంకట హరిప్రసాదరావు పేర్కొన్నారు.

అమ్మవారికి వెండి ఆభరణాల బహుకరణ

విశాలాంధ్ర-తాడేపల్లి : కుంచనపల్లిలో వేంచేసి యున్న శ్రీ కాశీ విశ్వేశ్వర ఆల యంలో అన్నపూర్ణ అమ్మ వారికి, సుమారు రూ.60 వేల విలువచేసే, వెండి కిరీటం, రెండు కర్ణ బేరీలు, చటారి, వెండి పళ్ళెమును గ్రామానికి చెందిన సీపీఎం గ్రామ కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రమాదేవి దంపతులు గురువారం ఆలయ ఈవో పి.అచ్చిరెడ్డి చేతుల మీదుగా ఆలయ పూజారికి అందజేశారు. అనంతరం దంపతులను ఈవో అచ్చిరెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ ఆంజనేయులు, కాట్రగడ్డ పూర్ణయ్య, కాజా పెద్ద వెంకటేశ్వరరావు, కాజా కాశీ రాంబాబు, చాగంటి సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హిందూపురంలో మీరు తక్కువ కులంవారని, గుడిలో పూజలు చేయడానికి వీలులేదని అడ్డగించి రజకులుపై దాడి చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీని వాసరావు తీవ్రంగా ఖండించారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని రజకులపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ప్రతి సామాజిక వర్గానికి భద్రత కల్పించాలని కోరారు. తెదేపా సర్పంచ్ మంజునాథ్ తన అనుచరులతో రజకులుపై దాడి చేయటం దుర్మార్గపు చర్య అని, తక్షణమే ఆ సర్పంచ్‌ను..అనుచరులను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రావెల్ టోకెన్లను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనులు వేగవంతానికి గ్రావెల్ కోసం జారీ చేస్తున్న టోకెన్లను దుర్విని యోగం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మంది రంలో జిఎంసి ఇంజినీరింగ్, హౌసింగ్, మైనింగ్ డిపార్టెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శు లతో జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కమిషనర్ తొలుత లే అవుట్స్ వారిగా ఇళ్ళ నిర్మాణం ఏ మేరకు పూర్తి అయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను అధికారులను, ఏమినిటీ కార్యదర్శులను అడిగి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణపనులు వేగంగా జరిగేం దుకు ఇప్పటివరకు గ్రావెల్ సమస్యగా ఉందని, జిల్లా కలెక్టర్ చొరవతో గ్రావెల్ కొరత లేకుండా లే అవుట్స్‌కు టోకెన్స్ ద్వారా సరఫరా జరుగు తుందన్నారు. గ్రావెల్ టోకెన్స్ హౌసింగ్ ఏ.ఈ.ల ద్వారా లే అవుట్స్‌లో ఇళ్ళ నిర్మాణ కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లకు ఇళ్ళ సంఖ్యకు అనుగు ణంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రావెల్‌ను కాంట్రాక్టర్లు జగనన్న లే అవుట్స్ లోనే వినియో గించేలా చూడాలని, దుర్వినియోగం చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్, ఇసుక, సిమెంట్, ఇనుము సమస్యల పరిష్కారానికి అధి కారుల ప్రభుత్వం వైపు నుండి సంపూర్ణ చర్యలు తీసుకుంటున్నందున నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకొని, పనుల వేగవంతం చేయాల న్నారు. సమావేశంలో ఆర్.డి.ఓ. ప్రభాకర రెడ్డి, మైనింగ్ డి.డి. సుబ్రమణ్యేశ్వరరావు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ. భాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘం పరపతి పెంపునకు కృషి చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో గురువారం సంఘం పరి ధిలోని తొమ్మిది గ్రామా లకు చెందిన 24 మంది రైతులకు రెండు కోట్ల ఐదు లక్షల రూపాయల రుణాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు హాజరై రైతులకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ఆర్కే మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక సహకార సంఘం తొలి విడత రైతులకు రెండు కోట్ల రూపాయలు రుణాలు పంపిణీ చేసిందని, రెండో విడతగా రెండు కోట్ల ఐదు లక్షల రూపాయలు రుణాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులు రుణాలను పంట పండిన తర్వాత తిరిగి చెల్లిస్తే తర్వాత పంటకు ఎక్కువ రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. రుణాలను సంపూర్ణంగా వినియోగించుకొని రైతులు అభివృద్ధి చెందుతూ సహకార సంఘం పరపతిని కూడా పెంచడానికి కృషి చేయాలన్నారు. రైతులకు అండగా ఉంటున్న చైర్మన్, పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ ఆర్ల బ్రహ్మయ్య, సభ్యులు సుంకర సుబ్బారావు, కర్రి మరియదాసు, మంగళగిరి జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ చినఖాసిం, సొసైటీ కార్యదర్శి రాయల్ రమేష్, వైసీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, ఎండీ ఫిరోజ్, కదం రాంబాబు, బేతపూడి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-పెదనందిపాడు : విద్యా ర్థులు దసరా సెలవుల్లో గ్రంథాలయా లను సద్వినియోగం చేసుకోవాలని ఎస్టీయూ గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు గేరా మోహనరావు అన్నా రు. గ్రంథాలయ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయ పుస్తక పఠనం వలన విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులందరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, గ్రంథాలయ పుస్తక పఠనం వలన మేధస్సు పెరుగుతుందని, ప్రపంచ జ్ఞానం కలుగుతుందని అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దసరా సెలవుల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిణి తెలియజేశారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొలగాని మంజుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాబుకు జరుగుతున్న అన్యాయాన్ని ఖండించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరే షన్: భావితరాల భవిష్యత్ ఆంధ్ర ప్రదేశ్ ఆస్తి నారా చంద్రబాబు నాయుడు అని ఆయనకు జరుగు తున్న అన్యాయాన్ని యావత్ పౌర సమాజం ఖండించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడుకి మద్దతుగా సంఘీభావం తెలియజేస్తూ నూతన వధూవరులైన జిల్లా తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి బొక్కా లక్ష్మణ్, ప్రభావతి దంపతుల పెళ్లి సందర్భంగా పేరేచర్లలో గల సుభాష్ చంద్రబోస్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ప్రార్థనలు అనంతరం చంద్రబాబు నాయుడుకి టీడీపీ నాయకులు వర్ల రామయ్య, శ్రావణ్ కుమార్, సాయికృష్ణతో పాటు తెలుగు యువత మద్దతుగా పెద్దఎత్తున పలకలు ప్లకార్డులతో మద్దతు తెలియజేసారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ ఘని, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ రిజ్వాన, జానీ బేగం, కోడూరి అఖిల్, శివన్నారాయణ, తలశిల ప్రసన్న, సింగు గోపి కృష్ణ, షేక్ షకూర్, నియోజకవర్గ టిడిపి నేతలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

గొట్టిపాటి సత్యనారాయణకు పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆడిట్ విభాగానికి చెందిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆడిట్ పార్టీ సీనియర్ ఆడిటర్ గొట్టిపాటి సత్యనారాయణ విద్యవిభాగంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రభుత్వ ఉద్యోగానికి ముందు సత్యనారాయణ గుంటూరులోని ఆర్వీఆర్ డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి 'వృత్తిపరమైన నిబద్ధత, సర్వీసులో ఉన్న అధ్యాపకుల ఉద్యోగ ప్రమేయానికి సంబంధించి బోధనా సామర్థ్యాలు' అనే శీర్షికతో ఆయన చేసిన థీసిస్‌ను గుంటూరులోని ఏఎల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్తేర్ సునీల పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఎల్ బీఎడ్ కళాశాల ఆవరణలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తేర్ సునీల సత్యనారాయణను సన్మానిం చారు. టీచింగ్, నాన్ టీచింగ్ సభ్యులు పాల్గొని సత్యనారాయణను అభినందించారు. తనకు పీహెచ్‌డీ రావడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ గొట్టిపాటి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు.

చర్మకార భవన్ నిర్మాణ పనులు పరిశీలన

విశాలాంధ్ర-తాడేపల్లి : నగరపాలక సంస్థ పరిధి లోని తాడేపల్లిలో నిర్మా ణం జరుగుతున్న డాక్టర్ బాబు జగజీవన్ రామ్ చర్మకార భవన్ నిర్మాణ పనులను గురువారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆర్కే పరిశీలిం చారు. నవంబర్ 15 నాటికి పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవం చేసుకోవడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఎంపీడీవో రాంప్రసన్న, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో గురువారం తాడేపల్లి టీడీపీ కార్యాలయం ఎదుట పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రా వు ఆధ్వర్యంలో 9వ వార్డుకి చెందిన తోకల ఎస్తేర్ రాణి, తొలిసూరి శివకుమారి, 5వ వార్డుకి చెందిన చంద్రమ్మకు 3 తోపుడు బండ్లు అందజేశారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, 9వ వార్డు అధ్యక్షులు బి.కుమార్, సీనియర్ నాయకులు ఇట్టా పెంచలయ్య, కొయ్య గోర మల్లేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇట్టా భాస్కర్, మంగళగిరి నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి పోటాబత్తిని శ్రీనివాసరావు, పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు కంచర్ల శివప్రసాద్, పట్టణ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కోడూరు నాగరాజు పాల్గొన్నారు.

ఉచితంగా మందులు, కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : పట్టణంలోని సీతానగరం ప్రాథ మిక ఆరోగ్య కేం ద్రంలో నవోదయ కాలనీ సచివాల యంనకు సంబంధించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు పాల్గొని ముందుగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వైద్యం నిమిత్తం వచ్చిన రోగులకు ఉచితంగా మందులు, కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్లు బిక్కిరెడ్డి శివారెడ్డి, శ్రీనివాసరావు, వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ఆరోగ్య మిత్ర సూర్యనారాయణ, తాడేపల్లి పట్టణ ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, బత్తుల దాసు, పాల్గొన్నారు.